క్లుప్తంగా

బీమా సాయం అందజేత

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు సర్పంచ్ రామమద్దిలేటిరెడ్డి అందజేశారు. మంగళవారం గ్రామానికి చెందిన మునగ నాగజ్యోతి(55) అనారోగ్యంతో మృతి చెందింది. తక్షణ సాయం కింద మృతురాలు కుమారుడు చంద్రహాస్‌గుప్తకు నగదును అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి మదనగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంటు నాగకుమార్, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘననివాళి

ఆళ్లగడ్డ: జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా ఘటనలో అమరులైన వీర జవాన్లకు మంగళవారం స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ, అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి శివన్న, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఆళ్లగడ్డ: వేసవి సమీపిస్తుండంతో గ్రామల్లో నీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం చాగలమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో పని చేయాలన్నారు. ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. శాసన మండలి కోడ్ అమల్లో ఉండటంతో సమావేశం నామమాత్రంగా సాగింది. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ముల్లా రఫి, ఆశీర్వాదమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, డాక్టర్ అంజలీ తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన కంది పంట



హరివరం గ్రామ సమీపంలో విరగపూసిన కంది పంట

ఉయ్యాలవాడ: ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభం నుంచి వర్షాలు సకాలంలో కురిశాయి. కంది పంట ఏపుగా పెరిగి పూత, కాయ దశలో ఉంది. మరో 15 రోజుల్లో దిగుబడులు రానున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హరివరం, ఆర్.పాంపల్లె, నర్సిపల్లె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సర్వాయిపల్లె, కాకరవాడ, తదితర గ్రామాల్లోని రైతులు 110 ఎకరాల్లో కంది సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కంది పప్పు కిలో రూ.120లు ధర పలుకుతోంది.

హంతకుడిని శిక్షించాలి

నంద్యాల(అర్బన్): తాడేపల్లిలో అంధురాలైన ఎస్తేరు రాణిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. అంధురాలని చూడకుండా హత్య చేసిన రౌడీషీటర్ కుక్కల రాజుని వికలాంగుల చట్టం ప్రకారం ఉరి తీయాలని కోరుతూ గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం వద్ద సంఘం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎస్తేరు రాణి కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఆమె తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్యశెట్టి, కిరణ్‌కుమార్, నబిరసూల్, అబ్దుల్ మనన్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించండి

- అధికారులు చురుకుగా పనిచేయాలి
- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతిపై సీడీపీఓలు, విద్యా, వైద్యాధికారులు ఏపీఎంలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించడం, ఆహారం, ఆరోగ్యం, అసమానతలను తగ్గించడం, తదితర ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంపై సంబంధిత అధికారులు అత్యంత చురుకుగా పని చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలు డేటా ప్రకారం చూస్తే నమ్మశక్యంగా లేదని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలలో మిడుతూరు 59 శాతం, దొర్నిపాడు 54 శాతం మంది పిల్లలు బరువు, ఎత్తు తక్కువగా ఉన్నట్లు చూపుతున్నారని, స్వయంగా పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలని స్త్రీ సంక్షేమ శాఖ పీడీ లీలావతిని ఆదేశించారు. వచ్చే సమావేశానికి కూడా ఇలాంటి పనితీరు ప్రదర్శిస్తే సంబంధిత సీడీపీఓలను సస్పెండ్ చేసేందుకు వెనకాడమన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోండి

హైరిస్క్ గర్భిణీ స్త్రీలు, బాలింతల్లో రక్తహీనతను అధిగమించేందుకు స్వయం సహాయక బృందాలను వినియోగించుకుని అవసరమైతే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పోషకాహార పదార్థాలను చేరవేయాలని కలెక్టర్ సూచించారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడానికి న్యూట్రిషన్ స్క్రిప్షన్ స్పెషల్ ఇంటర్వెన్షన్ టైం టేబుల్ ప్రకారం పోషకాహారాన్ని అందించాలన్నారు. గ్రామ, మండల సమైక్య సంఘాలలో ఈ అంశాన్ని అజెండాగా పెట్టుకుని విస్తృత ప్రచారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 10–19 సంవత్సరాల మధ్య వయసు గల 35,371 మంది కౌమారదశ బాలికల్లో రక్తహీనత ఉన్నట్లు వైద్య రికార్డుల్లో వెల్లడైందని ఆశా, ఏఎన్‌ఎంల ద్వారా పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న 3,800 మంది కౌమారదశ బాలికల్లో రక్త పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డీఎంహెచ్‌ఓ వెంకటరమణను, వెల్ఫేర్ అధికారులకు ఆదేశించారు.

రికార్డులు పూర్తి స్థాయిలో చూపాలి

జిల్లాలో బడి బయట ఉన్న 7,716 విద్యార్థుల్లో 6981 మంది విద్యార్థులను పాఠశాలల చేర్పించినట్లు లెక్కలు చెబుతున్నారే తప్ప సరైన రికార్డులు చూపడం లేదని, వచ్చే సమావేశానికి పూర్తిస్థాయిలో రికార్డులు చూపించాలని డీఈఓ అనురాధకు సూచించారు. పలు కారణాల వల్ల 735 మంది పిల్లలు బడికి బయట ఉన్నట్లు చెబుతున్నారని, ఇందుకు సంబంధించిన కారణాలను అన్వేషించి అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండో దశ నాడు–నేడు కింద చేపడుతున్న పనులను ప్రతి సోమవారం సచివాలయ సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీడీపీఓలు, ఏపీఎంలు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోడు లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): జగనన్న తోడు పథకంలో గుర్తించిన లబ్ధిదారులకు బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వాలని జిల్లాకలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాత్రి స్పెషల్ డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు ఫేస్–6లో భాగంగా చిరువ్యాపారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో జిల్లాలో 23,005 మందిని గుర్తించామన్నారు. అందులో రూరల్ ప్రాంతాల్లో 17,104 మంది చిరువ్యాపారులు ఉండగా , అర్బన్ ప్రాంతాల్లో 5901 మంది ఉన్నారన్నారు. వీందరికీ బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీసీఎం సత్యనారాయణ, నంద్యాల జిల్లా బ్యాంక్ లికేంజీ విభాగం అధికారి ఎల్లయ్య తదితరులు హాజరయ్యారు.

సైక్లింగ్‌తో మానసిక ఒత్తిడి దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

బొమ్మలసత్రం: ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని నంద్యాల జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని యువకులతో సైక్లింగ్ ర్యాలీని నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైక్లింగ్ చేయడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుందన్నారు. రక్తపోటు నివారిండానికి ఇది దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం వల్ల ఉత్సాహంగా, ఉల్లాసంగా గడపుతారని, ముఖ్యంగా క్యాన్సర్ జబ్బును ఓడించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రి నుంచి శ్రీనివాససెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది.

సమగ్ర భూ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర భూ సర్వే–భూ రక్ష పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ టౌన్ హాల్‌లో మున్సిపల్ అధికారులు, సచివాలయ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి హక్కుదారులకు టైటిల్ రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలను అందజేయాలని సూచించారు. అదేవిధంగా ఆస్తులకు సంబంధించి హక్కుదారుల పత్రాలను, అసెస్‌మెంట్లను రీ సర్వేలో పరిశీలించాలన్నారు. పట్టణ పరిధిలో ఉన్న వేకెంట్ ల్యాండ్, ప్రభుత్వ ఆస్తులను గుర్తించి వాటిని పరి రక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహామూర్తి, రెవెన్యూ అధికారి వరప్రసాద్రరావు, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

శిరివెళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలను హెచ్‌ఎం విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మార్చి 16న టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికలు జరగనున్నాయన్నారు. మండలంలో 1,333 మంది గ్రాడ్యుయేట్, 86 మంది టీచర్ల ఓటర్లు ఉన్నారన్నారు. వీరి కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా రెండు పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వీఆర్వో గోపాల్ పాల్గొన్నారు.

నల్లమలలో కార్చిచ్చు



అటవీ ప్రాంతంలో నుంచి వెలువడుతున్నపొగ, (ఇన్‌సెట్) మంటల్లో కాలుతున్న అటవీ ప్రాంతం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగాయి. ఆ మంటలకు గాలి తోడు కావడంతో అడవి మల మల మాడిపోతోంది. ఈ ప్రమాదంలో పచ్చని చెట్లు కాలి బూడిద అవుతూ అడవంతా బయలు ప్రదేశంగా మారుతోంది. పశు పక్షాదులు ప్రమాదం బారిన పడ్డాయి. ఈ అగ్ని ప్రమాదం స్థానిక అటవీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే సంభవించింది. మంటల్లో కాలుతున్న అడవి, చుట్టుముట్టిన పొగ దృశ్యాలు దగ్గరలోని అధికారులకు కన్పిస్తున్నా వారు మాత్రం తమకేమి తెలియదన్నట్లు మౌనంగా ఉండిపోవడం గమనార్హం. కొద్ది రోజుల క్రితమే అటవీశాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నుంచి అడవిని కాపాడేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఫైర్ వాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంటలు ఓ చోటు నుంచి మరో చోటుకు వ్యాపించకుండా మధ్యలో మూడు మీటర్ల వెడల్పులో గడ్డి లాంటివి ఏవీ లేకుండా చేశారు. అలాగే అడవిలో ఎక్కడ నిప్పు రాజుకున్న సిబ్బంది అందరు అప్రమత్తంగా ఉండి వెంటనే మంటలను ఆర్పేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. అవన్ని గాలి మాటలుగానే మిగిలి పోయాయి. మంటలు దావనంలా వ్యాపించి అడవిలోని విలువైన వృక్ష సంపదతో పాటు పశు పక్షాదుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు వేణుగోపాల్‌నాయుడు, సేవాస్తమ్ రాష్ట్ర కార్యదర్శి సత్యం, గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు రాజు నాయక్ తదితరుల ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాస్తమ్ జిల్లా కమిటీ నాయకులు మహానంది రోడ్డులోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమానికి బియ్యం, కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో రాజు, మనోహర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఎడ్ల బలప్రదర్శన

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మహానందిలో కరపత్రాలను ఆవిష్కరించారు. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతిగా రూ. 1.25లక్షలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అందిస్తున్నారన్నారు. ఆ తరువాతి స్థానాల్లో వరుసగా రూ. 80వేలు, రూ. 60వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, సబ్ జూనియర్స్ విభాగంలో రూ. 75వేలు, రూ. 60వేలు, రూ. 50వేలు, రూ.40వేలు, రూ. 30వేలు, న్యూకేటగిరీ విభాగంలో రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ. 30 వేలు,రూ.20వేలు బహుమతులు ఉంటాయనన్నారు.

ఉపాధ్యాయుల కొరతను నివారించండి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

నంద్యాల(వ్యవసాయం): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను నివారించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ కోరారు. మంగళవారం ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి వారి సమస్యలను స్వీకరిస్తూ పర్యటన చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా విద్యాశాఖ అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాలైన నూతన జాతీయ విద్యావిధానం, ప్రమోషన్లు, పని సర్దుబాటు పేరుతో పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకు తగ్గిస్తూ ఉన్న వారిపై పని భారం పెంచడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే డీఎస్సీ ద్వారా వీటిని భర్తీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్, మౌలాలి, లక్ష్మన్న, దేవేందర్, ప్రసాద్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనా విధానం మారాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): విద్యార్థుల ఆలోచన విధానాల్లో మార్పు రావాలని ఆర్‌ఏఆర్‌ఎస్ సైంటిస్టు నరసింహులు సూచించారు. ప్రకృతిలోని ప్రతి అంశాన్ని పరిశీలించే అలవాటును చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎస్పీజీ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. డీఈఓ అనురాధ జ్యోతి ప్రజ్వలన చేయగా, సీవీ రామన్ చిత్రపటానికి డిప్యూటీ విద్యాశాఖ అధికారి మహమ్మద్ బేగ్ పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి, సైంటిస్టు నరసింహులు మాట్లాడుతూ మారిన సిలబస్‌ను అనుసరించి ప్రతి పాఠంలో సైన్స్ కృత్యాలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకొని బాల సైంటిస్టులుగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలకు పునాదులు వేసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌కు 160 సైన్స్ ఎగ్జిబిట్స్ వచ్చాయని, వాటిలో ఉత్తమప్రతిభ, సమాజానికి అవసరమయ్యే ప్రథమ స్థానం పొందిన ఎగ్జిబిట్స్‌ను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

విజేతలు..

మొదటి ప్రాజెక్టు కింద పర్యావరణ హిత పదార్థాల వాడకం సురేంద్ర(జెడ్పీహెచ్‌ఎస్) వేంపెంట మొదటి బహుమతి, రెండవ బహుమతి రేణుక (కేజీబీవీ కొత్తపల్లి), రెండో సైన్స్ ప్రాజెక్టు కింద ఆరోగ్యం , పరిరక్షణకు రహంతుల్లా (ఏపీ మోడల్ స్కూల్, అవుకు), రెండో బహుమతి ఉదయ్‌కిరణ్ (జెడ్పీహెచ్‌ఎస్, పాములపాడు), మూడవ ప్రాజెక్టు కింద సాఫ్ట్‌వేర్ అక్స్‌లో సజియ(జెడ్పీహెచ్‌ఎస్, దుద్యాల) మొదటి బహుమతి, రెండో బహుమతి కింద శ్రీనివాస్(ప్రభుత్వ హైస్కూల్, పాంపల్లి) ప్రాజెక్టులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మం, రామబ్బయ్య, కోటయ్య, జీవలత, మాధురి, అసదుల్లా, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, శేషఫణి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం దారుల ఎన్నికలు ఏకగ్రీవం

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామంలో గోపాలక్రిష్ణ గొర్రెల పెంపకదార్ల సహకార సంఘానికి మంగళవారం ఎన్నికలు జరిగాయి. పశువైద్యాధికారి దస్తగిరి పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా అంబారపు చిన్న సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడిగా తూముల నాగేంద్ర, డైరెక్టర్లుగా పెద్దపుల్లన్న, సుబ్బరాయుడు, బాలుడు, వెంకటేశ్వర్లు, చిన్న నరసింహుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్వేసుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 544 మంది ఓటర్లు

దొర్నిపాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిచి మండలంలో 544 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ జయప్రసాద్ మంగళవారం తెలిపారు. పట్టభద్రులు 525, ఉపాధ్యాయులు 19 ఉన్నారన్నారు. వీరికోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఉత్సవ మూర్తులకు విశేష పూజలు



నక్కలదిన్నెలో పూజలందుకున్న స్వామి వారు

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామస్తులు మంగళవారం పార్వేట ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలా నరసింహ్మస్వామి, ప్రహ్లాద వరద స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మండలూరు నుంచి నక్కలదిన్నెకు వచ్చిన ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో స్వాగతించారు. సాయంత్రం గ్రామస్తులంతా ఒకే చోటికి వచ్చి పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవ మూర్తులకు వీడ్కోలు పలికి చందలూరుకు సాగనంపారు.

ఫేస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): ఫేస్ యాప్ ద్వారా హాజరు వేయాలనే నిబంధనల నుంచి వీఆర్‌ఏలకు మినహాయింపు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నందిపల్లె నాగేష్ కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డీఆర్‌ఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏల కనీస వేతనం రూ.26వేలు, పే స్కేల్ ఇవ్వాలన్నారు. సత్యరాజు, నాగరాజు, రామసుబ్బయ్య, అబ్దుల్‌గఫార్, భూపాల్ పాల్గొన్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

నంద్యాల(అర్బన్): బొమ్మలసత్రం వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న తదితరులు మాట్లాడుతూ విగ్రహాన్ని పగలగొట్టడం రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. అధికారులు వివాదం ముదరకముందే దోషులను గుర్తించి శిక్షించాలన్నారు. అలాగే విగ్రహ ధ్వంసానికి కుట్ర పన్నిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్‌లు కోరారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేడ్కర్ రాజ్యాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు.

దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

నంద్యాల(అర్బన్)/(సిటీ)/(వ్యవసాయం): అంబేడ్కర్ విగ్రహ ధ్వంసంపై దళిత బహుజన, ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బయ్య, లక్ష్మణ్ మాదిగ, లింగస్వామి, బెల్లం రాజ్‌కుమార్, దేవదాస్ పాల్గొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నాయకులు రామచంద్రుడు, షేక్ రియాజ్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషమని జమా అతె ఇస్లామి హింద్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆ సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవం లేని దుష్ట శక్తులను గుర్తించి శిక్షించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..

దుండగుల దాడిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసమైన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, త్రీటౌన్ సీఐ నరసింహులుతో కలిసి పరిశీలించారు.

దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

రుద్రవరం: నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ దళిత సమాఖ్య జిల్లా కో కన్వీనర్ ఎంవీ నరసింహ్మలు కోరారు. అలాగే అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహంపై దుశ్చర్య

బొమ్మలసత్రం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై మానసికస్థితి సరిగాలేని వ్యక్తి సోమవారం రాత్రి రాళ్లు ఉంచి, చేయి, ముక్కును పాక్షింకంగా ధ్వంసం చేశాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మలసత్రం సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మానసికస్థితి సరిగాలేని వ్యక్తి పాక్షికంగా ధ్వంసం చేసినట్లు తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి డ్వాగ్ స్క్వాడ్ తో వెళ్లి పరిశీలించటమే కాకుండా సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన వీడియోలను సేకరించామని చెప్పారు. విగ్రహం సమీపంలో ప్రతి రోజు వైట్‌నర్, శానిటైజర్ సేవిస్తూ తిరిగే వ్యక్తి విగ్రహం ధ్వంసానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఆ వ్యక్తి ఆచూకి కోసం 5 బృందాలు వెతుకుతున్నాయని, త్వరలో నిందితున్ని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

హైటెక్ 110 సీసీ స్కూటర్ విడుదల



స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఓ శ్రీకాంత్

నంద్యాల(అర్బన్): స్థానిక చామకాల్వ సమీపంలోని సౌజన్య మోటార్స్ నుంచి హైటెక్ 110 సీసీ స్కూటర్–ఎక్స్‌ఓఓఎం హీరో మోటో కార్ప్ విడుదలైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్యూచరిస్టిక్డిజైన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అసమానమైన చురుకుదనం, అత్యున్నత సౌకర్యం కలిగిన స్కూటీను మంగళవారం ఇన్‌చార్జి డీటీఓ శ్రీకాంత్ విడుదల చేశారు. షోరూం నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, మేనేజర్ శేఖర్‌రెడ్డి, ఎంవీఐ రవిశంకర్‌నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆవులు మృతి

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడులో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆవుల్లో నాగులు కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు రామాంజనేయులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే పశువులపాక దగ్ధం అయినట్లు బాధితుడు వాపోయాడు. ఆవులు సుమారు రూ.2లక్షల విలువ చేస్తాయని పేర్కొన్నాడు. పశువైద్యాధికారి హరిత మృతి చెందిన ఆవులను పరిక్షించారు.